


జపాన్‌కు చెందిన వాహన తయారీ సంస్థ హోండా.. థర్డ్ జనరేషన్‌గా దేశీయ మార్కెట్‌లోకి సరికొత్త అమేజ్ మాడల్‌ను విడుదల చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ధరల శ్రేణి రూ.7.99 లక్షల నుంచి రూ.10.89 లక్షలుగా ఉన్నది.

## జహీరాబాద్ నిమ్జ్‌లో ప్యూర్ ఈవీ ప్లాంట్

### రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ..తెలంగాణలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి వద్ద ప్లాంట్ ఉండగా, కొత్తగా జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో మరో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగ్రీ తెలిపారు. 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఈ యూనిట్ వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలకు 12 వేల నుంచి 15 వేల యూనిట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో కొత్తగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి ప్లాంట్‌తో 500 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కంపెనీకి చెందిన వాహనాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో



ఈ నూతన ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశీయంగా 70 రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వచ్చే రెండున్నరేండ్లలో మరో 250 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, స్కూటర్, మోటార్‌సైకిళ్లలోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.



ప్రముఖ వంటనూనెల ఉత్పత్తి సంస్థ గోల్డ్‌డ్రాప్‌ను మరోసారి ప్రతిష్ఠాత్మక సీఐటీడీ అవార్డు వరించింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా అందుకున్నారు.

## 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలి, శాసనసభ సమావేశాలు ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జారీ చేసిన గెజిట్ ఆధారంగా అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

## బుర్రా వీఆర్‌ఎస్‌కు ఆమోదం

### నేడు టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ): సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణకు ఆమోదం తెలుపుతూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. విద్యాశాఖ స్పెషల్ సీఎస్‌గా పనిచేస్తున్న ఆయన్ని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే.

# అమెరికా-చైనా టెక్ వార్

### ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం

### సెమీకండక్టర్ ఇండస్ట్రీలో ఆధిపత్య పోరు


వాషింగ్టన్/బీజింగ్, డిసెంబర్ 4: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైంది. అయితే ఈసారిది టెక్నాలజీ వార్‌ను సంతరించుకున్నది. చిప్ తయారీపై తీవ్ర ప్రభావం చూపేలా ఇరు దేశాలు పరస్పర ఆంక్షల్ని, నిషేధాల్ని తెచ్చిపెట్టుకున్నాయి మరి. ఈ మేరకు సోమవారం బైడెన్ సర్కారు నిర్ణయాలుంటే.. వాటికి ప్రతిగా మంగళవారం జిన్‌పింగ్ ప్రభుత్వం నిర్ణయాలు వచ్చాయి. నిజానికి గ్లోబల్ సెమీకండక్టర్ ఇండస్ట్రీలో అమెరికా, చైనాలు ఆధిపత్యం కోసం గత కొంతకాలం నుంచి కొట్టుకుంటున్నాయి. దాన్ని తీవ్రతరం చేస్తూ అమెరికా కొన్ని కొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. ఇవి 140 చైనా సంస్థల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇందులో ప్రధాన సెమీకండక్టర్ తయారీ సంస్థలైన పయోటెక్, సైక్యారియర్, నౌరా టెక్నాలజీ గ్రూప్‌లున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ (చిప్) తయారీ టెక్నాలజీ చైనాకు అందకూడదనే లక్ష్యంగా ఆయా ఎగుమతులపై అమెరికా ఆంక్షల్ని విధించినట్టు తెలుస్తున్నది. కటింగ్-ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్స్ సాంకేతికతలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దానికి బ్రేకులు వేసేందుకే ఆ టెక్నాలజీలో బలంగా ఉన్న అగ్రరాజ్యం ఈ చర్యలకు దిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### చైనా ప్రతీకార చర్యలు

అమెరికా తీరుకు చైనా గట్టిగానే స్పందించింది. సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించే విడిభాగాల ఎగుమతులకు బ్రేక్ వేసింది. అమెరికాకు గాలియం, జర్మేనియం, ఆంటిమొని తదితర ప్రధాన హై టెక్నాలజీ సరకు రవాణాకు కళ్లెం వేసింది. జాతీయ భద్రతపై ఆందోళనల దృష్ట్యా మిలిటరీ కోసమైనా, పౌర అవసరాల కోసమైనా జరిగే వీటి ఎగుమతుల్ని నిషేధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంతకుముందు వీటి ఎగుమతులపై ఆంక్షలుండగా, ఇప్పుడు పూర్తిగా నిషేధాన్ని తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గాలియం, జర్మేనియం లభ్యత చాలా చాలా తక్కువగా ఉన్నది. దొరికే ఆ కొద్ది నిల్వలు సైతం చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. కాగా, సెల్‌ఫోన్లు, కార్లు, సోలార్ ప్యానెల్స్, మిలిటరీ టెక్నాలజీల్లో వాడే కంప్యూటర్ చిప్స్ తయారీకి ఈ ముడి పదార్థాలన్నీ కూడా చాలా చాలా కీలకం. ఇంకా చెప్పాలంటే మిలిటరీ అప్లికేషన్ల దగ్గర్నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఈ సెమీకండక్టర్లే ప్రధానం. దీంతో అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు ఒక్కసారిగా చెడినట్టైంది. అంతకుముందు అమెరికా.. కొత్త తరం సాంకేతికతతోకూడిన చిప్‌ల తయారీలో వినియోగించే పరికరాలు, అత్యున్నత శ్రేణి మెమరీ చిప్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్ని కఠినతరం చేసింది. గతంలోనూ వీటిపై నిషేధం విధించినా ఆ తర్వాత సడలించింది. మానవ సాయంతో నిమిత్తం లేకుండా స్వయంప్రతిపత్తితో పనిచేయగలిగిన ఆయుధాల తయారీలో ఈ చిప్‌లే కీలకం. వాటి విడిభాగాలు ప్రస్తుతం అమెరికా నుంచే చైనాకు పెద్ద ఎత్తున వెళ్తున్నాయి.

## చిప్ తయారీ రంగం కేంద్రంగా పరస్పర ఆంక్షలు

### ట్రంప్ రాకముందే రాజుకున్న మంటలు



### ట్రంప్ రాకముందే..

అమెరికా నూతన అధ్యక్షుడిగా మరోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో గద్దెనెక్కబోతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడే ఆ వాతావరణం ఏర్పడటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నిజానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆ స్థానంలో ముందున్నది ట్రంపే. అప్పుడు ట్రంప్ దూకుడు.. చైనాతో పరస్పర సుంకాలకు దారితీసింది. కానీ బైడెన్ రాకతో పరిస్థితులు కొంత శాంతించాయి. అయినప్పటికీ గత మూడేండ్లలో అమెరికా-చైనా మధ్య ఈ రకమైన పోరు వస్తూపోతూనే ఉన్నది. ఇప్పుడది తీవ్రరూపం దాల్చగా.. ట్రంప్ రాకతో ఇంకెంత తీవ్రతను సంతరించుకుంటుందోనన్న ఆందోళనలు అంతటా వ్యాపిస్తున్నాయిప్పుడు. ఇక ట్రంప్ హయాంలో చైనా నుంచి అమెరికాకు పెద్ద ఎత్తున జరిగే ఎగుమతుల కట్టడే లక్ష్యంగా సుంకాల పెంపు జరిగింది. కానీ ఇప్పుడు చిప్ తయారీలో ఆధిపత్యం కేంద్రంగా నిర్ణయాలుంటున్నాయి. మొత్తానికి వచ్చే ఏడాది నుంచి సెమీకండక్టర్ ఇండస్ట్రీల్లో అలజడులు ఖాయమనే చెప్పవచ్చు.

## భారత్‌కు లాభమేనా?

అమెరికా-చైనా మధ్య చోటుచేసుకున్న ఈ ట్రేడ్ అండ్ టెక్ వార్.. భారత్‌కు లాభమేనా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇందుకు ట్రంప్ హయాంలో వచ్చిన అవకాశాల్నే గుర్తుచేస్తున్నారు. నాడు చైనాతో అమెరికా వాణిజ్యం పడిపోగా.. భారత్‌సహా మరికొన్ని దేశాలకు పెరిగింది. అమెరికాకు భారత్, వియత్నాం, మెక్సికో నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతి పుంజుకున్నది. ఇప్పుడు కూడా అమెరికా సాయంతో సెమీకండక్టర్ ఇండస్ట్రీలో భారత్ నిలదొక్కుకోవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి అంతర్జాతీయంగా భారత్ ఎదుగుదలను చైనా అడ్డుకుంటున్నది. కానీ ఇదే సమయంలో భారత్‌పట్ల అమెరికా సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నది. పైగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, డొనాల్డ్ ట్రంప్‌కు నడుమ మంచి స్నేహభావం ఉండటం కూడా ఇక్కడ కలిసొస్తుందని అంటున్నారు. భారత్ వంటి పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికాకు నష్టమేనని, కాబట్టి సాంకేతికంగా అగ్రరాజ్యం నుంచి సహకారం ఉంటుందనే ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే అమెరికా తాజా నిర్ణయం జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర దేశాలనూ కొంత ఇబ్బంది పెడుతున్నది. దీంతో ఆసియా మార్కెట్‌లో అమెరికా-చైనా ట్రేడ్ వార్ గట్టిగానే ప్రకంపనల్ని సృష్టించేలా ఉన్నది.

## యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు

ముంబై, డిసెంబర్ 4: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వ్‌బ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

### ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఇంటర్నెట్ సర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్..హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్(జీఎస్‌ఈసీ)ని నెలకొల్పడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దేశంలో తొలి సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ కాగా, అలాగే ప్రపంచంలోనే ఐదోది కావడం విశేషం. ఈ జీఎస్‌ఈసీ ఏర్పాటునకు సంబంధించి గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం హాన్సెన్ మాట్లాడుతూ..డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో రాష్ట్రం ముందంజలో ఉన్నదని, ప్రపంచవ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉన్నదన్నారు. ఈ నూతన సేఫ్టీ సెంటర్ ద్వారా సైబర్ సేఫ్టీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి వీలు పడనున్నదన్నారు. అలాగే ఈ సెంటర్‌తో వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

### ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులకు కిక్కు

జీఎస్‌ఈసీ ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించనున్నది. ఏఐ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకారం అందించనున్నది. ఇదిలావుంటే దేశంలో నైపుణ్యాభివృద్ధిని, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేయనున్నది.



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్

## కొనసాగుతున్న రుపీ పతనం

ముంబై, డిసెంబర్ 4: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుఫీ-డాలర్ రేటు 64.65-84.76 స్థాయిలో కదలాడింది.




## బల్దియాలో ఉన్నతాధికారులకు సెక్షన్ల మార్పు

కార్పొరేషన్, డిసెంబర్ 4: కరీంనగర్ నగరపాలక సంస్థలోని ఉన్నతాధికారులకు సెక్షన్లను మార్చుతూ నగర కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అడిషినల్ కమిషనర్ సువార్తకు పెన్షన్ విభాగం డిజిటల్ కీతో సహా, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఆర్‌టీఐ, ప్రజాదర్బార్, ప్రజల పాలన, కోర్టు కేసులు, నల్లా సెక్షన్లు కేటాయించగా, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణికి ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం, రెవెన్యూ, ప్రజావాణి, మెప్మా విభాగాలను కేటాయించారు. అలాగే అదనపు కమిషనర్ వేణుమాధవ్‌కు సానిటేషన్, ట్రేడ్ లైసెన్సులు, డాగ్ నిర్వహణ, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్, ఎస్‌యూపీ, లైబ్రరీలను కేటాయించారు. ఎస్‌ఈ రాజ్‌కుమార్‌కు నీటి సరఫరా, స్ట్రీట్ లైట్లు, ఆఫీస్ నిర్వహణ, ఇంజినీరింగ్ అభివృద్ధి పనులు, హరితహారం, సమావేశాల నిర్వహణ అప్పగించారు. ఇన్‌చార్జి ఏసీపీ వేణుకు టౌన్‌ప్లానింగ్, అక్రమ నిర్మాణాల తొలగింపు, డీఆర్‌ఎఫ్, కోర్టు కేసులను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో పలు విభాగాలకు చెందిన కిందిస్థాయి సిబ్బంది ఉన్నతాధికారుల పనితీరుపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన క్రమంలోనే మార్పులు చేసినట్లు తెలుస్తున్నది.

## డీఈఈసెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 4: డీఈసెట్ 2024లో ఉత్తీర్ణులై, ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేయించుకొని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు రెండోదశలో ప్రవేశం కోసం ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు గురువారం ఎల్‌ఎండీ కాలనీలోని డైట్ కాలేజీలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య తెలిపారు. పూర్తి వివరాలకు http://deect.cdse.telangana. gov.in సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజా పాలనలో నిర్భంధాలు సరికాదు



త్రీటౌన్ పోలీసుల అదుపులో ఆటో యూనియన్ నాయకులు

తెలంగాణచౌక్, డిసెంబర్ 4: ప్రజా పాలన పేరుతో ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, కార్మిక, ప్రజా సంఘాల నాయకులను ఎలా అరెస్ట్ చేస్తుందని..?, ఈ నిర్భంధం సరికాదని ఆటో సంక్షేమ సంఘం జేఏసీ నాయకులు మండిపడ్డారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. బుధవారం పెద్దపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి సభను అడ్డుకుంటారనే భయంతో ఆటో యూనియన్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మద్దె రాజేందర్‌తో పాటు యూనియన్ ముఖ్య నాయకులను 3టౌన్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను చెప్పుకునేందుకు సభకు వెళ్లకుండా పోలీసులతో అరెస్టు చేయించడం ప్రజాస్వామ్యం ఎలా అవుతుందన్నారు. ఏడాది కాలంగా ఆటో డ్రైవర్లు ఉపాధికోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నా సీఎం, మంత్రులు ఎందుకు స్పందించడం లేదో చెప్పాలన్నారు. ఎన్ని నిర్భంధాలు చేసిన ఆటో డ్రైవర్ల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 7న ఆటో బంద్, కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నాకు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని పిలుపు నిచ్చారు.

## 7న సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 4: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా 7న ఉదయం 10 గంటలకు నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో కొలువై ఉన్న వల్లీదేవసేనా సహిత సుబ్రహ్మణ్య స్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

## పేద కుటుంబాలకు చేయూత

గంగాధర, డిసెంబర్ 4: ఆర్థిక భరోసాలో భాగంగా గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణపూర్, మల్లాపూర్, మంగపేట గ్రామాల్లో బుధవారం 30 పేద కుటుంబాలకు వెయ్యి చొప్పున రూ.30 వేలు అందజేశారు. నగదు అందజేసిన ఫౌండేషన్ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఫౌండేషన్ డైరెక్టర్ జోగు పాల్, నియోజకవర్గ కార్యదర్శి పొత్తూరి సురేశ్, ఎంపీవోలు గజ్జెల సతీశ్, అఖిల్ పాల్గొన్నారు.

## ఇదేం భోజనం?

- ముద్దల అన్నం ఎట్ల తింటరు..?
- హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- కేసీ క్యాంపులో గురుకుల స్కూల్ సందర్శన

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 4: 'ఇదేం భోజనం. ముద్దల అన్నం ఎట్ల తింటరు..? పిల్లలకు ఇలాగేనా పెట్టేది' అంటూ హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక అసహనం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని కేసీ క్యాంపులో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను బీఆర్‌ఎస్‌వీ నాయకులతో కలిసి సందర్శించారు. తరగతి గదులు, వసతి గృహం, స్నానాల గదులు, వంటగది, భోజనశాలను పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించారు. అన్నం ముద్దలు ముద్దలుగా ఉండడాన్ని గుర్తించారు. విద్యార్థినులతో కలిసి భోజన సదుపాయాలు, విద్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోపాలున్నా తమకు ఫోన్ చేయాలని పిల్లలకు సూచించారు. వారితో కలిసి భోజనం చేశారు. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడారు. అన్నం ముద్దగా ఉండడం వల్ల పిల్లలు తినలేక పోతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యాన్ని మాత్రమే తాము వండి పెడుతున్నామని సిబ్బంది చెబుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాణ్యమైన బియ్యాన్ని మాత్రమే పంపించాలని డిమాండ్ చేశారు. బియ్యం నాసిరకంగా ఉండడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, ఈ విషయంలో నిర్వాహకులను అంటే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. గదుల కొరతను తీర్చాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సందర్శనలో మున్సిపల్ కౌన్సిలర్లు కేశిరెడ్డి లావణ్య, ఉజ్మా నురీన్, నాయకురాలు కొయ్యడ శ్రీదేవి, బీఆర్‌ఎస్వీ నాయకులు విడపు అనురాగ్, వడ్ల కొండ కిరణ్, అనుదీప్, అరవింద్, విజయ్, సాయి, ఆకాశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌టౌన్: హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక

### నాణ్యమైన భోజనం అందించండి

రామడుగు, డిసెంబర్4: ప్రభుత్వ విద్యాలయాల్లో అభ్యసించే పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని బీఆర్‌ఎస్ జిల్లా గురుకుల బాట ఇన్‌చార్జి అవాల హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ గురుకులాల బాటలో భాగంగా రామడుగులోని మోడల్‌స్కూల్, బీసీ బాలికల వసతిగృహం, ఎస్సీ బాలికల వసతిగృహంతో పాటు వెదిరలోని ఎస్సీ బాలుర వసతిగృహం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సందర్శించారు. భోజనం తయారుచేసే తీరును పరిశీలించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యంతోనే వసతి గృహాల్లో కలుషితహారంతో పిల్లలు మృతి చెందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజన నిర్వహణలో ఇన్నేండ్లపాటు లేని లోపాలు ఇప్పుడే ఎందుకు జరుగుతున్నాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇక్కడ బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ ద్యావ మధుసూధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్వై నియోజకవర్గ అధ్యక్షుడు బంధారపు అజయ్‌గౌడ్, రామడుగు మండల బీఆర్‌ఎస్వై అధ్యక్షుడు ఆరపెల్లి ప్రశాంత్, రామడుగు మండలాధ్యక్షుడు బండారి చరణ్, మాజీ మండలాధ్యక్షుడు మధు ఉన్నారు.

## టెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి
- వీఎన్‌ఆర్ క్లాసెస్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ప్రారంభం

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 4: వీఎన్‌ఆర్ క్లాసెస్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న బీఈడ్, డీఈడ్ అభ్యర్థులకు ఉచిత టెట్ కోచింగ్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు బాసటగా నిలిచేందుకు వీఎన్‌ఆర్ క్లాసెస్ ఆధ్వర్యంలో నేటి నుంచి 30 రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిపుణులైన అధ్యాపకులతో ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కిట్స్ ట్యుటోరియల్ నిర్వాహకుడు సత్యం, టీచర్స్ అకాడమీ నిర్వాహకుడు చందు, రాచమల్ల రాజు, కేశిపెద్ది శ్రీధర్ రాజు, దొగ్గలి శ్రీధర్, సిరిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.



శిక్షణను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి

## ఎంసీహెచ్‌లో నర్సింగ్ ఆఫీసర్ మృతి

విద్యానగర్, డిసెంబర్ 4: గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కరీంనగర్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోని ఎస్‌ఎన్‌సీయూలో కాంట్రాక్టు పద్ధతిన నర్సింగ్ ఆఫీసర్‌గా పనిచేసే చెరుకు సమ్మక్క (28) అనారోగ్యంతో మృతి చెందింది. సమ్మక్క ఎప్పటిలాగే మంగళవారం రాత్రి విధులకు హాజరైంది. అనారోగ్యంగా ఉందని తోటి సిబ్బందితో చెప్పి, ఒక మాత్ర వేసుకుని రెస్ట్‌రూంలోకి వెళ్లింది. బుధవారం ఉదయం రూం శుభ్రం చేయడానికి వచ్చిన సిబ్బంది, సమ్మక్కను పిలువగా కదలకపోవడంతో వెంటనే అప్రమత్తమై ఐసీయూకు తరలించారు. అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. కాగా, తన భార్య మృతిపై అనుమానం ఉందని, దవాఖానలో ఉన్న వారిని విచారణ చేయాలని, సీసీ పుటేజీని పరిశీలించి న్యాయం చేయాలని ఆమె భర్త తిరుమల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

- టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

విద్యానగర్, డిసెంబర్ 4: దవాఖానలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సూచించారు. బుధవారం రాత్రి కరీంనగర్‌లోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో వైద్యాధికారులతో రివ్యూ నిర్వహించారు. చొప్పదండి, మానకొండూర్, జమ్మికుంట, హుజూరాబాద్ దవాఖానల్లో అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. దవాఖానల్లో పూర్తిస్థాయిలో మందులు, సిబ్బంది ఉన్నారని, సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. సమీక్షలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు హుజూరాబాద్ దవాఖానలో తనిఖీ చేశారు.



మాట్లాడుతున్న వీసీ ఉమేష్ కుమార్, పాల్గొన్న అధ్యాపకులు

## ఎస్‌యూలో నైపుణ్య అభివృద్ధి కేంద్రం ప్రారంభం

కమాన్‌చౌరస్తా డిసెంబర్ 4: శాతవాహన విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ ఆడిటోరియంలో శాతవాహన విశ్వవిద్యాలయ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ సాధనకు అనుగుణంగా నైపుణ్య అభివృద్ధి కోసం ఈ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జీ దామోదర్ కీలక ఉపన్యాసం చేశారు. ఇక్కడ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం వరప్రసాద్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ మహమ్మద్ జాఫర్, డాక్టర్ జయంతి, డాక్టర్ హరికాంత్, ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఈ మనోహర్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ శిక్షకుడు డీ విజయ ప్రకాష్, డాక్టర్ ప్రదీప్ రాజ్, డాక్టర్ మనోజ్ కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.